## క్లుప్తంగా

### లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం



**గుడివాడ టౌన్:** ప్రజల్లో చైతన్యం ద్వారానే లింగ నిర్ధారణ వంటి కార్యక్రమాలను అరికట్ట గలుగుతామని ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం జరిగింది. లింగ ఎంపిక నిషేధ చట్టం 1994, గర్భస్రావం నియంత్రణ నిబంధనలు 2003 అమలుపై డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. లింగ నిర్ధారణ ఎంపికను నిషేధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, గర్భస్రావ కేంద్రాల నియంత్రణ, గర్భధారణ పరిశీలన పరికరాల వినియోగంపై మానిటరింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆర్డీఓ అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ధీరజ్ వినీల్, ప్రోగ్రామ్ ఆఫీసర్ అరుణ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఉప్పాల హారికకు పరామర్శ



**గుడ్లవల్లేరు:** టీడీపీ గూండాలు దారుణంగా అవమానించిన కృష్ణాజిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికను గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి శుక్రవారం పరామర్శించారు. గన్నవరం వైఎస్సార్ సీపీ నాయకురాలు పి. శివనాగరాజకుమారితో కలిసి ఉప్పాల హారిక నివాసంలో మాట్లాడారు. గుడివాడలో జరిగిన దాడి అమానుషం అన్నారు. అనంతరం ఈ దాడిపై జిల్లా పరిషత్ సీఈఓ చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా నాయకుడు మరీదు రాంబాబు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**ముదినేపల్లి రూరల్:** సమాజంలో నిత్యం జరుగుతున్న నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వీరభద్రరావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో శక్తి యాప్, సైబర్ క్రైం, యాంటీ ర్యాగింగ్ యాక్ట్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని సక్రమ మార్గంలో నడుచుకోవాలన్నారు. సహచర విద్యార్థినులను సోదరీమణులుగా భావించి, వారికి అండగా నిలవాలని కోరారు.

### కృత్రిమ కాలు అందజేత

**గన్నవరం:** పేదల అభ్యున్నతికి మానవత స్వచ్ఛంద సంస్థ పాటుపడుతుందని గన్నవరం యూనిట్ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. అంగవైకల్యంతో బాధపడుతున్న గన్నవరానికి చెందిన కొనకళ్ల రామతులసమ్మకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సౌజన్యంతో కృత్రిమ కాలును అందజేశారు. తోటపల్లి హీల్ సంస్థలో కృత్రిమ కాలు తయారు చేయించి అందజేసినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కన్వీనర్ కర్రా వరప్రసాదరావు, కార్యదర్శి వీవీ.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

### షైనింగ్ టీచర్‌గా దుర్గాభవాని ఎంపిక



**పమిడిముక్కల:** పమిడిముక్కల హైస్కూల్ హెచ్ఎం యలమంచిలి దుర్గాభవాని షైనింగ్ టీచర్‌గా ఎంపికయ్యారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో గత సంవత్సరం హెచ్ఎంగా దుర్గాభవాని పనిచేశారు. పదో తరగతిలో 54 మంది విద్యార్థులకు 540 మార్కులకు పైగా సాధించారు. దీంతో హెచ్ఎంను షైనింగ్ టీచర్‌గా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ శుక్రవారం తన చాంబర్‌లో దుర్గాభవానీని సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. సత్కారం అందుకొన్న దుర్గాభవానీని ఎంఈఓ-1,2లు పద్మారాణి, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

### ధ్యాన శిక్షణ

**గన్నవరం రూరల్:** మానవుడు ధ్యాన సాధన ద్వారా దైవస్థితికి చేరుకోవచ్చని గన్నవరం పత్రీజీ సరస్వతి పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు ఎం.నాగ రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పురుషోత్తపట్నం సాయిబాబా మందిరంలో పత్రీజీ అమృతోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉచిత ధ్యాన, జ్ఞాన బోధన శిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్వం తనలోనే ఉన్నదని తానే ఆత్మ పదార్థం అని మానవుడు తెలుసుకోవాలన్నారు. ధ్యాన సాధన ద్వారా ఆ దైవ స్థితికి మనిషి చేరుకోవచ్చని పేర్కొన్నారు.

# అన్నదాతకు సహకారం ఏదీ?

- సకాలంలో అందని సాగునీరు
- అరకొరగా వరినాట్లు
- వెదజల్లే పద్ధతిపై రైతుల మొగ్గు



శేరివేల్పూరులో దుక్కుదున్ని నాట్లు వేసేందుకు సాగునీటి కోసం ఎదురు చూస్తున్న పొలాలు



శేరివేల్పూరులో నీరు లేక ఎండుతున్న వెదజల్లిన పొలాలు

**గుడివాడరూరల్:** గుడివాడ నియోజకవర్గంలో సకాలంలో కాలువలకు నీరు విడుదల చేయకపోవడంతో వర్షం నీటితో రైతన్నలు శ్రమకోర్చి వరినాట్లను ప్రారంభించారు. ప్రతి ఏడాది జూలై నాటికి కాలువలకు సాగునీరు విడుదలయ్యేది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు జూలై రెండో వారం పూర్తయినా సాగునీరు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో వచ్చిన నీరు కాలువలు, డ్రెయిన్లలో ఉండటంతో ఆ నీటినే ఇంజిన్ల ద్వారా కొందరు రైతులు పెట్టుకుని నారుమడులు పోశారు. నారుమడులు అదునుకు రావడంతో రైతులు డ్రెయిన్లు, కాలువల్లో ఉన్న కొద్దిపాటి నీటిని ఇంజిన్ల ద్వారా పొలాలకు పెట్టుకుని వరినాట్లు వేస్తున్నారు.

**ఇంజిన్లకు అదనపు పెట్టుబడి**

గతంలో కాలువలకు, డ్రెయిన్లకు నీరు సకాలంలో రావడంతో రైతులకు అదనపు పెట్టుబడి లేకుండా వరినాట్లు వేసేవారు. ప్రస్తుతం కాలువలకు నీరు వదలకపోవడంతో చేసేది లేక, అదనపు పెట్టుబడి పెట్టిమరీ నాట్లు వేసే ప్రక్రియ ప్రారంభించారు. నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని గ్రామాల్లో నాట్లు వేసే ప్రక్రియ సాగుతోంది. రైతులకు సకాలంలో నీరు రాకపోవడంతో కూలీలు, ఇంజిన్ల ఖర్చు ఎక్కువ కావడంతో అప్పులు చేసి మరీ వరిసాగు చేస్తున్నారు.

**అందని పెట్టుబడి సాయం**

గతంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా సిబ్బంది సలహాలు, సూచనలతో పాటు ప్రభుత్వం రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయంతో రైతులు నాట్లు సులువుగా వేసేవారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు విరుద్ధంగా మారడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి సహకారం అందకపోవడంతో రైతులు నాట్లు వేసే ప్రక్రియ బదులు వెదజల్లే పద్ధతిపై మక్కువ చూపుతున్నారు.

**41,550 ఎకరాల్లో వరిసాగు**

గుడివాడ నియోజకవర్గంలో మూడు మండలాల్లో కలిపి 41,550 ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌కు వరిసాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. సకాలంలో సాగునీరు రాకపోవడం, ప్రభుత్వం నుంచి సహకారం అందకపోవడం రైతులు ఇబ్బందులుపడుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటి వరకు 20 శాతం నాట్ల ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. రైతులు మిగతా నాట్లు వేసేందుకు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీరు అందించి సకాలంలో నాట్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

**సకాలంలో సాగునీరు అందలేదు**



జూలై రెండో వారం పూర్తయినా అరకొరగానే సాగునీరు వచ్చాయి. మరో పక్క వర్షాలు లేకపోవడంతో నాట్లు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. కాలువల్లో వచ్చిన సాగునీటిని పెట్టుకునేందుకు ఇంజిన్ల కోసం ఎక్కువ ఖర్చు అవుతోంది. ప్రభుత్వం ఆదుకోకపోతే ఈ ఖరీఫ్‌లో నాట్లు వేయలేం.

– రవిప్రసాద్, రైతు, గుడివాడ

**రైతులను ఆదుకోవాలి**



ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. సాగునీరు లేకపోవడంతో నాట్లు వేసేందుకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. నీరు పూర్తిగా అందిస్తారో లేదో ఇరిగేషన్ అధికారులు చెప్పడం లేదు. ప్రభుత్వం సకాలంలో కాలువలకు నీరు విడుదల చేసి వరిసాగుకు సహకారం అందించాలి

– సత్యనారాయణ, రైతు, నందివాడ

## శాకంబరిగా అమ్మవారు



తోట్లవల్లూరులో శాకంబరిగా భ్రమరాంబ అమ్మవారు



విజయదుర్గ అమ్మవారి ఆలయంలో శాకంబరేశ్వరీదేవిగా దర్శనం



భీమేశ్వరస్వామి ఆలయంలో శాకంబరేశ్వరీదేవిగా అమ్మవారు

**తోట్లవల్లూరు:** స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ఆలయ అర్చకులు పొన్నూరు బాలాజీ, పొన్నూరు నాగుశర్మ, చాగంటిపాటి శ్రీనివాసరావు, చాగంటిపాటి ఉమాశంకర్ అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరి దుర్గానాగేశ్వరరావు పర్యవేక్షించారు.

**పెదపూడిలో..**

**పెదపూడి(మొవ్వ):** మొవ్వ మండలం పెదపూడి శ్రీ సీతా రామ చంద్ర స్వామి భక్త కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా భక్తులు గ్రామంలోని దేవేరులకు ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. తొలుత గ్రామ దేవత గంగానమ్మకు, లక్ష్మమ్మకు, చంద్రమ్మ తల్లికి, శివాలయంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి, శ్రీ కోదండ రామాలయంలో, శ్రీ సీతా రామ చంద్ర స్వామి ఆలయంలోని సీతామ్మవారికి సారెను అందజేశారు.



పెదపూడిలో ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు

**గుడివాడలో..**

**గుడివాడ టౌన్:** పట్టణంలోని ప్రలు ఆలయాల్లో శుక్రవారం అమ్మవార్లను శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వరస్వామి (పెద్ద శివాలయం), గౌరీశంకరపురంలోని శ్రీ గౌరీ శంకరస్వామి(చిన్న శివాలయం), నీలా మహల్ రోడ్డులోని శ్రీ విజయదుర్గ ఆలయాల్లో అమ్మవార్లను శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించారు. ఆషాఢ మాసం అమ్మవారికి సారె సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.



వేమవరంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

**శ్రీ కొండాలమ్మకు సారె**

**గుడ్లవల్లేరు:** మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండాలమ్మ అమ్మవారికి భక్తులు సారె బహూకరించారు. ఆషాఢ మాసం శుక్రవారం పురస్కరించుకుని మచిలీపట్నం బలరాముని పేటకు చెందిన మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. దేవస్థానం సిబ్బంది ఆహ్వానించగా అర్చక స్వామి శివ సంతోష్ వర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కైకలూరు శ్యామలాంబ ఆలయంలో ఆషాఢ సారెతో వచ్చిన భక్తులు

**కైకలూరులో..**

**కైకలూరు:** ఆషాఢ మాసం సందర్భంగా కైకలూరు శ్యామలాంబ తల్లి క్షేత్రంలో రామలింగేశ్వరస్వామి శివాలయంలో పార్వతీమాతకు వెలంపేట మహిళా భక్తులు ఆషాఢ మాససారెను శుక్రవారం సమర్పించారు. సారె తీసుకొస్తున్న మహిళలకు ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ స్వాగతం పలికారు.

## వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



డీఎన్నార్‌తో మాట్లాడుతున్న చింతలపూడి ఇన్‌చార్జి విజయరాజు, నాయకులు

**కైకలూరు:** క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఇటీవల స్వల్ప అస్వస్థతతో చికిత్స పొంది పూర్తి ఆరోగ్యంతో ఇంటికి చేరుకున్న డీఎన్నార్‌ను ఏలూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల సమన్వయకర్తలు మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంటి వద్ద డీఎన్నార్‌ను చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు కలిసి యోగాక్షేమాలు అడిగారు. నియోజకవర్గ పార్టీ పటిష్టతపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో ఏలూ రు జిల్లా పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షుడు జానారెడ్డి, చింతలపూడి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చండీప్రియ, కామవరపుకోట మండల అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహనరావు, తడికలపూడి మాజీ సొసైటీ ప్రెసిడెంట్ గుర్రాల రవి కుమార్ పాల్గొన్నారు.

## బస్సు డ్రైవర్‌కు జైలు శిక్ష, జరిమానా

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** మూడేళ్ల బాలుడు మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌కు నూజివీడు కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. బాపులపాడు మండలం వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ పరిధిపూర్‌కు చెందిన జజ్జర్ ఆలీ 2021 సెప్టెంబర్ 9వ తేదీన తన కుటుంబంతో కలిసి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో కేరళ విహారయాత్రకు వెళ్తుతూ మార్గమధ్యంలో బాపులపాడు మండలం అంపాపురంలోని ఓ హోటల్ వద్ద భోజన విరామం కోసం ఆగారు. భోజనం ముగించుకుని తిరిగి బస్సు బయలు దేరుతున్న తరుణంలో తండ్రి జజ్జర్ ఆలీతో పాటుగా బస్సు ఎక్కుతున్న కుమారుడు సలీం ఆలీ (3) కింద పడి పోయాడు. దీంతో సలీం ఆలీపై బస్సు టైర్లు ఎక్కటంతో బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి చార్జిషీటు ఫైల్ చేశారు. ఈ కేసులో నూజివీడు న్యాయస్థానం బస్సు డ్రైవర్ స్నేహిల్ జోసెఫ్‌పై నేరం రుజువు కావటంతో 15 రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు.

## మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలి

**తోట్లవల్లూరు:** గరికపర్రు కుమ్మరివాని చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను అధికారులు అరికట్టాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు, మాజీ సర్పంచ్ నడకుదురు రాజేంద్ర కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావుకు ఆయన పలువురు గ్రామస్తులతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో అక్రమ తవ్వకాలకు గ్రామంలోని అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి తెర తీశారని రాజేంద్ర ఆరోపించారు. వార్డు సభ్యులకు తెలియకుండా, ఎలాంటి పబ్లిక్ ఆక్షన్, ఎస్టిమేట్ లేకుండా తవ్వకాలు చేపట్టడం దారుణమన్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వార్డు సభ్యులు వీరంకి కృష్ణారావు, కే. హేమలత, నాయకులు చింతలపూడి సుబ్బారావు, వీరంకి రాము, మైనేని తారాచంద్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



గరికపర్రులో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న రాజేంద్ర తదితరులు

## యాదవులకు అండగా కొడాలి నాని



విలేకరులతో మాట్లాడుతున్న యాదవ సామాజిక వర్గ నాయకులు

**గుడివాడటౌన్:** గుడివాడ నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గానికి అన్ని విషయాల్లో అండగా ఉన్నది మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అని యాదవ సామాజిక వర్గ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో నాయకులు మాట్లాడారు. ఒక బీసీ మహిళకు అన్యాయం, అవమానం జరిగిన విషయాన్ని ఖండిస్తూ మాజీ మంత్రి కఠారి ఈశ్వర్ కుమార్ మాట్లాడటాన్ని రాజకీయం చేయడం సరికాదన్నారు. కఠారి ఈశ్వర్ కుమార్ తన వ్యక్తిగతంగా కొడాలి నానికి మద్దతు తెలిపారన్నారు. దీనిని కూటమి నాయకులు విమర్శించడం సరికాదన్నారు. గడచిన కొన్ని ఎన్నికల్లో ఓసీ స్థానాల్లో సైతం బీసీలకు సీట్లు ఇచ్చి వారిని గెలిపించి బీసీల పక్షాన నిలిచిన నాయకుడు కొడాలి నాని అని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, జెడ్పీటీసీ సభ్యులు జి.రామకృష్ణ, కె.దుర్గా కుమారి, సర్పంచ్ జ్యోత్స్నాదేవి, పలువురు యాదవ సామాజిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై అప్రమత్తం

**గుడివాడ టౌన్:** మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని ఆర్పీఎఫ్ ఎస్ఐ పి. రామకృష్ణ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో వాసవ్య మహిళా మండలి, ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా దినోత్సవంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణ సమయంలో కొందరు పరిచయం పెంచుకుని పిల్లలను మాటల్లో పెట్టి ట్రైన్‌లో తరలిస్తూ ఉంటారన్నారు. అమాయకపు పిల్లలు వారితో కలిసి వెళ్లిపోతారని, వారు ప్రయాణ సమయంలో వారి ప్రవర్తన ప్రత్యేకంగా ఉంటుందన్నారు. అలాంటివారిని గుర్తించినపుడు 1098, 1800, 1027, 222, 2470 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలు ఎవరైనా అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్నా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈనెల 30వ తేదీన జరగనున్న ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ డి. రమేష్, ఏఎస్ఐ ఎస్‌కె అక్బర్, డి. శ్రీధర్, డీసీపీయూ చంద్రమ్మ, మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. దివ్య, కో–ఆర్డినేటర్ సీహెచ్. ఉషారాణి, సీఎస్‌డబ్ల్యూ దివ్య పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు, తదితరులు

### ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతున్న ప్రభుత్వం



ఉయ్యూరు సుందరమ్మపేటలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

**ఉయ్యూరు:** ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని సుందరమ్మపేటలో విద్యుత్‌చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లపై శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. బాబూరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూ అప్ చార్జీలతో సామాన్యులపై విద్యుత్ భారాన్ని మోపి ప్రజల కష్టాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట రూ.15,485 కోట్ల భారాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, నాయకులు కె.శివనాగేంద్రం, రాజేష్, సుబ్బారావు, లక్ష్మణరావు, కీర్తి, గోపాల్ పాల్గొన్నారు.

### సహకార సొసైటీలకు ఎన్నికలు నిర్వహించండి

**మొవ్వ:** సహకార సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా తాత్సారం చేసి.. తమకు అనుసీయులు నియమించి కూటమి ప్రభుత్వం తప్పు చేస్తోందని సీపీఎం మండలం కార్యదర్శి శీలం నారాయణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతం రైతాంగం సమస్యలను పరిష్కారం కోసం సహకార సొసైటీలకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సహకార సంఘం సొసైటీ ద్వారా రైతులకు విత్తనాలు, రుణాలు, ఎరువులు అందజేయాలని డిమాండ్ చేశారు.

### ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

**మొవ్వ:** స్థానిక వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల్లో ఆర్థిక అక్షరాస్యతపై ఆన్‌లైన్ అవగాహన సదస్సును కామర్స్, ఐక్యూఏసీల సమన్వయంతో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ శృతి గుప్తా ఎన్ఎస్ఈ ట్రైనర్ మాట్లాడుతూ నేటి కాలంలో ఆర్థిక ప్రణాళిక, ఆర్థిక ప్రాముఖ్యత స్టాక్ ఎక్స్చేంజ్, పొదుపు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్స్ మాధవి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పొదుపు, పెట్టుబడుల మీద అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ కేఆర్ మంజుల, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ జి కరుణశ్రీ, కామర్స్ విభాగ అధిపతి బి.శివ నాగేశ్వరరావు, కామర్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

### 20న సుబ్బారాయుడి కల్యాణోత్సవం

**ముదినేపల్లి రూరల్:** సింగరాయపాలెం–చేవూరిపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20న స్వామివారి మాస కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి శుక్రవారం తెలిపారు. స్వామి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే దంపతులు రూ.2,116 చెల్లించి ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆషాఢ కృత్తిక సందర్భంగా ఆడికృత్తిక కావడిసేవ మహోత్సవం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనే వారు రూ.558 చెల్లిస్తే ఆలయం తరపున కావడిని సమకూరుస్తారని తెలిపారు.

### సులభశైలిలో బోధించాలి

**ముదినేపల్లి రూరల్:** ఉర్దూ మీడియంలో చదివే విద్యార్థులకు సులభశైలిలో బోధించాలని ఎంఈఓ కె.నరేష్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సంఘర్షణపురం ఉర్దూ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కొన్ని సబ్జెక్టులపై ఉన్న భయాలను తొలగించేందుకు మానసిక సామర్థ్యాలకు అనుగుణంగా బోధించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని సూచించారు.

### ప్రజలకు అవగాహన కల్పించండి

**పమిడిముక్కల:** ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రగతి పథంలో మన పామర్రు కార్యక్రమంపై ప్రజలకు అవగాగాహన కల్పించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఎంపీడీఓకు సూచించారు. మండలంలోని చోరగుడి గ్రామంలో శుక్రవారం ప్రగతిపథంలో మన పామర్రు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 45 రోజులకొకసారి జరిగే ఈ కార్యక్రమ ప్రగతిని ప్రజలకు వివరించాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లోని సమస్యలను పరిష్కారించాలన్నారు. ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందని, గోపాలకృష్ణాపురం, ఆలీనఖీపాలెం రహదారులు అధ్వానంగా ఉన్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, ఎంపీడీఓ విజయరామరాజు, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంఈఓ పద్మారాణి పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కైకలూరు:** జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో విద్యుత్ మరమ్మతుల కోసం 33 కేవీ పల్లెవాడ ఫీడర్‌కు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. దీని వలన 33/11 కేవీ పల్లెవాడ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల గృహ, వాణిజ్య, పరిశ్రమ, ఆక్వా విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ ఉండబోదని పేర్కొన్నారు.

### ఆటో ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు

**పెనమలూరు:** పోరంకివద్ద విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి గాయాలు అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. గుడివాడ మున్సిపల్ హైస్కూల్‌లో పని చేస్తున్న ఎం.శ్రీనివాసరావు తన బైక్‌పై గుడివాడ నుంచి విజయవాడకు వెలుతుండగా పోరంకి వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని ఆటో అతనిని ఢీ కొట్టి ఆగకుండా వెళ్లి పోయింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న శ్రీనివాసరావు రోడ్డు పైపడిపోవటంతో గాయాలయ్యాయి. అతనిని స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.